
www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 16 మార్చి 2023



ఒలంపియాడ్‌లో సృజనశ్రీకి రాష్ట్రస్థాయి గుర్తింపు

ప్రజాశక్తి-పీలేరు

పీలేరుకు చెందిన బండి సృజనశ్రీకి ఒలంపియాడ్‌లో రాష్ట్రస్థాయి ర్యాంక్ లభించింది. పీలేరు 'ప్రజాశక్తి' డివిజన్ ఇన్‌ఛార్జిగా పనిచేస్తున్న బండి రామచంద్ర రెండవ కుమార్తె చిత్తూరు జిల్లా, బైరెడ్డిపల్లి మండలం, కమనపల్లి ఆంధ్రప్రదేశ్ బాలికల గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. 2022 సంవత్సరానికి మంగళగిరిలోని ఏపీఏఎంటీ నిర్వహించిన ఒలింపియాడ్ పరీక్షల్లో తాను రాష్ట్ర స్థాయి 7వ ర్యాంకు సాధించింది. దీంతో గుంటూరు, ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయంలోని అబ్దుల్ కలాం ఆడిటోరియంలో బుధవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఏపీఏఎంటీ ప్రెసిడెంట్ శ్రీనాథ్ చేతులు మీదుగా సుజనశ్రీ ప్రశంసాపత్రం అందుకుంది.


పురస్కారం అందుకుంటున్న సృజనశ్రీ

ఆశల పల్లకిలో..!



రాష్ట్ర ప్రభుత్వం గురువారం బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెట్టనుంది. ఓ వైపు జిల్లాల విభజన నేపథ్యంలో తిరుపతి జిల్లాకు ప్రత్యేకంగా ఏమైనా ప్రకటిస్తారేమోననే ఆశతో జిల్లా ప్రజానీకం ఉంది. మరోవైపు ఎన్నికలకు ముందు ఏడాది బడ్జెట్ కావడంతో సంక్షేమంతోనే సరిపెడతారా..? ఏమైనా 'సహకారం' అందిస్తారా? అన్నది వేచి చూడాల్సిందే. వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సాగునీటి ప్రాజెక్టులకు బడ్జెట్ ఊసే లేకుండా పోయింది. ఉగాదికి ప్రారంభించాల్సిన జగనన్న ఇళ్లు నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్నాయి. ఉద్యోగ, ఉపాధ్యాయులకు సైతం ఒకటో తేదీ జీతాలిచ్చే పరిస్థితి లేదు.

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో

టిడిపి అధినేత చంద్రబాబుపై పంతంతో కుప్పానికి హంద్రీనీవా నీటిని తీసుకొస్తామని ప్రకటించిన పెద్దిరెడ్డి ఏ మేరకు నిధులను రప్పిస్తారో మరి. మరోవైపు జగన్మోహన్‌రెడ్డి పాదయాత్రల సందర్భంగా సహకార చక్కెర ఫ్యాక్టరీలను తెరిపిస్తామని, విజయ డెయిరీని పున్ణప్రారంభిస్తామని ప్రగల్భాలు పలికారు. అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి ఊసే లేకుండా పోయింది. సహకార చక్కెర ఫ్యాక్టరీల్లో యంత్రాలు తుప్పు పడుతున్నాయి. ప్రభుత్వ చక్కెర ఫ్యాక్టరీలు లేకపోవడంతో చెరకు సాగునే రైతులు ముగించేశారు. అరకొరగా ప్రైవేట్ ఫ్యాక్టరీలకు తోలదామంటే కోట్లల్లో ఇప్పటికే రైతులకు బకాయిలున్నాయి. 30వేల ఎకరాల్లో సాగయ్యే చెరకు పంట నేడు ఏడువేల ఎకరాలకే పరిమితమయ్యింది. అవ్వ బువ్వ పెట్టా పెట్టదు, తిననివ్వదు అన్న చందంగా సహకార పరిశ్రమలను తెరిపించరు. రైతుల బకాయిలను పాలకులు ఇప్పించరన్న విమర్శలున్నాయి. మరోవైపు తుప్పుపట్టిన యంత్రాలతో ఉన్న విజయ డెయిరీని అప్పనంగా 'అమూల్'కు అప్పగించేశారు. ఇక రైతుల పక్షమని చెప్పే జగన్మోహన్‌రెడ్డి వ్యవసాయానికి, ఉద్యానవనానికి ఏమాత్రం నిధులను కేటాయిస్తారో వేచి చూడాల్సిందే. చెరువుల మరమ్మతుకు నిధుల కేటాయింపు లేదు. ఇక ఉద్యోగ పక్షపాతిగా చెబుతున్నా ఇప్పటివరకూ ఒపిఎస్ ఊసే లేదు. ఉద్యోగులందరికీ సంబంధించిన 'డిఎ' బకాయిలన్నీ పెండింగ్ ఉన్నాయి. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసినా ప్రత్యేకంగా ఒరిగిందేమీ లేదు. ఎటువంటి దారుణ పరిస్థితంటే ఆర్టీసీ ఆస్తులను లీజుకిచ్చి వచ్చే డబ్బులతో బకాయిలను చెల్లించాల్సిన దుస్థితి నెలకొంది. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులను క్రమబద్ధీకరణ చేయలేదు. పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగి రాష్ట్రంలో వ్యాట్ మరింత భారంగా రాష్ట్ర ప్రజానీకానికి ఉంది. ఈ నేపథ్యంలో పక్క రాష్ట్రాల నుంచి అడ్డదారుల్లో సరుకులు వచ్చే పరిస్థితి. ఈ నేపథ్యంలో వ్యాట్‌పై పునరాలోచన చేస్తారేమో చూడాలి. ఇక గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో రోడ్ల దుస్థితి ఘోరంగా ఉంది. గుంతల్లో రోడ్డెక్కడ ఉందో వెతుక్కునే దుస్థితిలో ఇటీవల యువగళం యువనేత నారా లోకేష్ రోడ్డుపై గుంతలతో సెల్ఫీలను తీసుకున్నారు. జనసేన కార్యకర్తలు రోడ్లపై నిలిచిన వర్షపునీటిలో నాట్లు నాటారు. ఈ నేపథ్యంలో కనీసం కొన్ని రహదారులకైనా నిధులు కేటాయిస్తారేమో చూడాల్సిందే. ఇక బటన్ నొక్కే 'సంక్షేమ' పథకాలకూ అరకొరగానే అప్పటికప్పుడు తడుముకుంటూనే నిధులు వెతుక్కునే పరిస్థితిలో ప్రభుత్వం ఉంది. మరోవైపు ఉపాధి హామీ, భవన నిర్మాణ సంక్షేమ నిధులు పక్కదారి మళ్లాయన్న విమర్శలూ లేకపోలేదు. ఏదిఏమైనా 'అప్పుల పల్లకిలో' ప్రభుత్వం ఉంటే 'ఆశల పల్లకిలో' తిరుపతి జిల్లా ప్రజానీకం ఉంది. అయితే ఎన్నికలకు ముందస్తు బడ్జెట్ కావడంతో ఏమైనా నిధుల కేటాయింపు ఉంటుందా? లేదా? అన్నది వేచి చూడాల్సిందే

ఎవరి ధీమా వారిది...!

నేడే ఎంఎల్‌సి ఎన్నికల కౌంటింగ్ / ప్రభుత్వ వ్యతిరేక ఓట్లపై టిడిపి నమ్మకం

సంక్షేమ పథకాలపైనే వైసిపి ఆశ / ప్రజావ్యతిరేక, నిబద్ధతపైన 'పీడీఎఫ్' భరోసా

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తూర్పు రాయలసీమ ఎంఎల్‌సి ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎన్నికల ఫలితాలు మరికొద్ది గంటల్లో వెలువడనున్నాయి. ఎవరి భవితవ్యం ఏంటన్నది ఇప్పటికే బ్యాలెట్ బాక్సుల్లో భద్రంగా ఉంది. గెలుపుపై ఎవరి ధీమా వారిది. సంక్షేమ పథకాలే తమను గెలిపిస్తాయన్న ఆశతో వైసిపి ఉంది. ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు తమకే పడి ఉంటాయని టిడిపి నమ్మకం. ప్రజా, ఉద్యోగ, ఉపాధ్యాయ వ్యతిరేక విధానాలు, నిబద్ధతతో తాము చేసిన పోరాటాలే తమను గెలిపిస్తాయని పీడిఎఫ్ అభ్యర్థులు ధీమాతో ఉన్నారు. బిజెపి విషయానికి వస్తే నాలుగో స్థానంలోనూ నిలిచే పరిస్థితి లేదు. పట్టభద్రుల స్థానంలో 22 మంది బరిలో ఉన్నారు. వీరిలో ప్రధానంగా పోటీలో ఉన్నది పీడీఎఫ్ నుంచి మీగడ వెంకటేశ్వర్‌రెడ్డి, వైసిపి నుంచి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి, టిడిపి నుంచి కంచర్ల శ్రీకాంత్, బిజెపి నుంచి సన్నారెడ్డి దయాకర్‌రెడ్డిలు పోటీలో ఉన్నారు. అలాగే టీచర్ల నియోజకవర్గం నుంచి 8 మంది బరిలో నిలిచారు. పీడీఎఫ్ నుంచి పొక్కిరెడ్డి బాబురెడ్డి, వైసిపి నుంచి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మధ్యనే ప్రధాన పోటీ నెలకొంది. బిజెపి నుంచి బ్రహ్మానందం ఉన్నారు. టిడిపి పీడీఎఫ్‌కే మద్దతు ప్రకటించింది. టీచర్లకు మొదటి ప్రాధాన్యత, పట్టభద్రులకు రెండో ప్రాధాన్యత ఓటు వేయాలని ప్రచారం నిర్వహించింది. వామపక్షాలు సైతం పీడీఎఫ్ అభ్యర్థులకు మద్దతు ప్రకటించి ప్రచారం చేశారు. యుటిఎఫ్, ఎస్‌టియు ఉపాధ్యాయ సంఘాలతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల్లో పనిచేసే వివిధ ఉద్యోగసంఘాలు పీడీఎఫ్‌కే జైకొట్టాయి.


కౌంటింగ్ టేబుళ్లు



కౌంటింగ్‌కు సర్వం సిద్ధం

916 మంది సిబ్బంది నియామకం

రిటర్నింగ్ అధికారి హరినారాయణన్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ప్రకాశం - నెల్లూరు - చిత్తూరు ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గ ఎంఎల్‌సి ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ మరికొద్ది గంటల్లో ప్రారంభం కానుంది. 916 మంది సిబ్బందిని నియమించినట్లు రిటర్నింగ్ అధికారి హరినారాయణన్ వెల్లడించారు. ఎన్నికల కమిషన్ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈనెల 13న పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. తిరుపతిలోని 229, 233 పోలింగ్ స్టేషన్లలో రీ పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించారు. గురువారం చిత్తూరు ఆర్‌విఎస్ లా కాలేజీలో ఉపాధ్యాయ ఎంఎల్‌సి, ఇంజినీరింగ్ కాలేజీలో పట్టభద్రుల ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ఉదయం 8 గంటలకు ప్రారంభం కానుంది. అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తిచేసి, సిబ్బందికి శిక్షణను ఇప్పటికే ఇచ్చారు. పట్టభద్రుల ఎంఎల్‌సి కౌంటింగ్‌కు 40 టేబుళ్లు, ఉపాధ్యాయ ఎంఎల్‌సి కౌంటింగ్‌కు 14 టేబుళ్లు ఏర్పాటు చేశారు. ఈ ప్రక్రియలో 193 మంది కౌంటింగ్ సూపర్‌వైజర్లు, 551 మంది కౌంటింగ్ అసిస్టెంట్లు, 172 మంది మైక్రో అబ్జర్వర్లు మొత్తం 916 మంది సిబ్బంది పాల్గొంటారని కలెక్టర్ వెల్లడించారు.

ఇంటర్ పరీక్ష ప్రారంభం : 1585 మంది విద్యార్థులు గైర్హాజరు / తొలిరోజు ఇద్దరు డీబార్

ప్రజాశక్తి - తిరుపతి సిటి

రాష్ట్ర వ్యాప్తంగా 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు మార్చి 15 నుంచి ప్రారంభమైన విషయం అందరికి విదితమే. మొదటి రోజు బుధవారం ఇంటర్ మొదటి సంవత్సరం తెలుగు, సంస్కృతం పరీక్షలు జరిగాయి. మొత్తం రెండు జిల్లాల్లోని 141 సెంటర్లలో జనరల్ కేటగిరిలో 50390 మంది విద్యార్థులకు గానూ 1585 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తం 48805 మంది విద్యార్థులు పరీక్షలు రాశారని, అదేవిధంగా తిరుపతిలో ఇద్దరు విద్యార్థులు డిబార్ అయినట్లు తిరుపతి ఆర్ ఐ వో వి.రమేష్ విలేకరులకు తెలిపారు. ఇదిలా ఉండగా పరీక్షలు రాస్తున్న పిల్లల్లో కంటే తల్లి దండ్రుల్లోనే ఎక్కువ ఆందోళన కనిపించింది. పిల్లల్ని వారే దగ్గరుండి సెంటర్‌కు తీసుకొచ్చి, తీసుకెళ్లడం గమనార్హం. విద్యార్థుల యొక్క హాల్ టికెట్ లో సరైనటువంటి సెంటర్ యొక్క అడ్రస్ లేనందువలన చాలామంది విద్యార్థులు అడ్రస్ తెలియక ఆందోళన చెందారు. దీంతో కొంత గందరగోళం ఏర్పడింది. ఈ విషయం లో ఇంటర్మీడియట్ బోర్డు విఫలమైందని చెప్పొచ్చు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నిర్ణయం మేరకు సీసీ కెమెరాలు, పోలీస్,రెవెన్యూ,ఇంటర్ విద్యాశాఖ అధికారులు,ఇతర అధికారుల సమన్వయంతో ప్రతిష్టాత్మకంగా ప్రశాంత వాతావరణంలో ఇంటర్ మొదటి పరీక్ష జరిగింది.



మహిళా వర్సిటీలో జాతీయ సదస్సు ప్రారంభం

ప్రజాశక్తి - క్యాంపస్

శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం తిరుపతి డిపార్ట్మెంట్ ఆఫ్ అప్లైడ్ మైక్రో బయాలజీలో రెండు రోజుల నేషనల్ కాన్ఫరెన్స్ రీసెంట్ అడ్వాన్సస్ ఇన్ మైక్రోబియాల్ టెక్నాలజీ అండ్ అలైడ్ సైన్సెస్ 2023ను బుధవారం ప్రారంభించారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం కులసచివులు ఆచార్య ఎన్. రజిని మాట్లాడుతూ ఆహారపు ప్రాముఖ్యత, సూక్ష్మజీవుల యొక్క పాత్ర గురించి వివరించారు. ప్రొఫెసర్ పి సుజాతమ్మ స్కూల్ ఆఫ్ సైన్సెస్ ఈ కార్యక్రమాన్ని కొనసాగించారు. ప్రొఫెసర్ సంజీవ్ పటాన్కర్ నేషనల్ కన్వీనర్ మైక్రో బయాలజీ సొసైటీ ఇండియా పూర్వపు రోజుల నుంచి నేటి వరకు సూక్ష్మజీవుల ఆవశ్యకత గురించి జీవన విధానంలో సూక్ష్మజీవుల పాత్ర గురించి వివరించారు. లతా శుక్ల డిపార్ట్మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ పాండిచ్చేరి యూనివర్సిటీ విచ్చేసి మష్రూమ్ కల్టివేషన్, శిలీంద్రాలు ప్రాముఖ్యత వివరించారు. ఈ కార్యక్రమం నేషనల్ కాన్ఫరెన్స్ కన్వీనర్ ప్రొఫెసర్ సువర్ణలతాదేవి కాన్ఫరెన్సు విచ్చేసినటువంటి వివిధ రాష్ట్రాల అతిథులు ప్రొఫెసర్లు విద్యార్థుల గురించి వివరించారు. ఈ కార్యక్రమానికి తమిళనాడు, కర్ణాటక, కేరళ, తెలంగాణ నుంచి విచ్చేసినటువంటి ప్రొఫెసర్లు, స్కాలర్లు కార్యక్రమాన్ని ఏ విధంగా ఉపయోగించుకోవాలో వివరించారు. కార్యక్రమంలో హై మీడియా రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ హెడ్ డాక్టర్ కమలేష్ జంగిట్ మైక్రోబియఎల టాక్సానమీ గురించి వివరించారు. డాక్టర్ రవీందర్ సింగ్ అతిథి ఔషధ మొక్కల ప్రాముఖ్యత గురించి వివరించారు. మ్యూజిక్ డిపార్ట్మెంట్ ప్రొఫెసర్ బిందు అలాగే విద్యార్థిని సాయి సుప్రజ భరతనాట్యంతో అలరించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ ఉమామహేశ్వరిదేవి, ప్రొఫెసర్ చండీ కుమారి, హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్ ప్రొఫెసర్ జయమాధురి, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



తిరుపతిలో రీపోలింగ్ ప్రశాంతం

ఏజెంట్, మీడియాపై సిఐ ఓవరాక్షన్

చర్య తీసుకోవాలని పిడిఎఫ్ అభ్యర్థి డిమాండ్

రీ పోలింగ్ 46.39 శాతం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తిరుపతిలో పట్టభద్రుల ఎంఎల్‌సి రీ పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ 229 పోలింగ్ బూత్ (చిన్న బజారువీధి, గర్ల్స్ హైస్కూల్)లో 49.57 శాతం నమోదయ్యింది. 233 బూత్ (సత్యనారాయణపురం)లో 44.07గా నమోదయ్యింది. రీపోలింగ్ సరాసరి 46.39 శాతంగా ఉంది. మధ్యాహ్నం 2 గంటలకు 229 బూత్‌లో 639 ఓట్లకు గాను కేవలం 205 ఓట్లు మాత్రమే వేశారు. 233 బూత్‌లో 886 ఓట్లు ఉండగా మధ్యాహ్నం 2 గంటలకు 187 ఓట్లు మాత్రమే పోలయ్యాయి. దొంగ ఓట్లను పూర్తిగా అరికట్టారని చర్చ నడుస్తోంది. చివరి నిమిషంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పోలీసుల సహకారంతో దొంగ ఓట్లు వేయాలని ప్రయత్నించినా ఎన్నికల అధికారులు ససేమిరా అన్నారు. సత్యనారాయణపురం పోలింగ్ బూత్‌లోకి పీడీఎఫ్ పట్టభద్రుల ఎంఎల్‌సి అభ్యర్థి మీగడ వెంకటేశ్వర్‌రెడ్డి జనరల్ ఏజెంట్‌గా వాడ గంగరాజు వెళుతుండగా సిఐ చంద్రశేఖర్ అడ్డుకుని దురుసుగా మెడ పట్టి తోసేశారు. అయితే 50 అడుగుల దూరంలోనే వైసిపి అభ్యర్థి శ్యాంప్రసాద్‌రెడ్డి, ఎంపి గురుమూర్తి, డిప్యూటీ మేయర్ అభినయ్‌రెడ్డి ఉండొచ్చు, తాను మాత్రం దూరంగా ఉండాలా అని వాడా గంగరాజు మీడియాకు వివరిస్తుండగా సిఐ మరింత దురుసుగా మీడియా పట్ల ప్రవర్తిస్తూ కెమెరా లాక్కునే ప్రయత్నం చేశారు. దీన్ని పట్టభద్రుల ఎంఎల్‌సి అభ్యర్థి మీగడ వెంకటేశ్వర్‌రెడ్డి ఖండించారు. సిఐను విధుల నుంచి సస్పెండ్ చేయాలని ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. పిడిఎఫ్ నాయకులు కందారపు మురళి సిఐని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లినట్లు మీడియాకు తెలిపారు.

రీ పోలింగ్ ప్రశాంతం : కలెక్టర్

పట్టభద్రుల రీపోలింగ్ ప్రశాంతంగా జరిగిందని కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా ఎస్‌పి పకడ్బందీ బందోబస్తు ఏర్పాటు చేశారన్నారు. 229 పోలింగ్ కేంద్రానికి శ్రీకాళహస్తి ఆర్డీవో రామారావును, 233 పోలింగ్ కేంద్రానికి గూడూరు ఆర్డీవో కిరణ్‌కుమార్‌ను ప్రత్యేక అధికారులుగా నియమించామన్నారు. పోలింగ్ ముగిసిన అనంతరం 229 పోలింగ్ కేంద్రంలో 579 ఓటర్లకు గాను 287 ఓటర్లు ఓటింగ్ వేయగా 49.57శాతం, 233 పోలింగ్ కేంద్రం లో 792 ఓటర్లకు గాను 349 ఓటర్లు ఓటింగ్ వేయగా 44.07శాతం ఓటింగ్ నమోదు వెరసి రీపోలింగ్ లో రెండు పోలింగ్ కేంద్రాలలో 1371 ఓటర్లకు గాను 356 మంది పురుషులు, 280 మహిళలు వెరసి మొత్తం 636 మంది ఓటింగ్ లో పాల్గొనగా నమోదైన పోలింగ్ శాతం 46.39శాతమని తెలిపారు. పోలింగ్ ప్రక్రియ పూర్తి అయిన అనంతరం సీల్ చేసిన బ్యాలెట్ బాక్సులు సంబంధిత సామాగ్రితో బందోబస్తు నడుమ చిత్తూరు లోని స్ట్రాంగ్ రూముకు తరలించామన్నారు. అలాగే పోస్టల్ బ్యాలెట్ బాక్సునుకలెక్టరేట్ నుండి బందోబస్తు నడుమ ప్రత్యేక వాహనంలో చిత్తూరు స్ట్రాంగ్ రూమ్ కి తరలించారు.


పోలీసుల ఓవరాక్షన్‌ను ప్రశ్నిస్తున్న పీడీఎఫ్ పట్టభద్రుల అభ్యర్థి మీగడ వెంకటేశ్వర్‌రెడ్డి

సిఐ చంద్రశేఖర్‌పై చర్యకు డిమాండ్

సత్యనారాయణపురంలో రీపోలింగ్ జరుగుతున్న బూత్ వద్ద విధులు నిర్వహిస్తున్న సిఐ చంద్రశేఖర్ అక్రమాలకు పాల్పడుతున్న అధికార పార్టీ నాయకులను విడిచిపెట్టి, పిడిఎఫ్ అభ్యర్థి జనరల్ ఏజెంట్ గంగరాజు పై దౌర్జన్యానికి పాల్పడటం అన్యాయమని, గంగరాజు పై చేయి చేసుకొని అవమానకరంగా ప్రవర్తించడం దారుణమని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి విమర్శించారు. అధికార పార్టీకి తొత్తులా ప్రవర్తిస్తున్న చంద్రశేఖర్ పై చర్యలకు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశామని, ఆయన వ్యవహార శైలిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నట్టు ఆ ప్రకటనలో తెలిపారు. అలాగే మీడియా పట్ల దురుసుగా వ్యవహరించిన సిఐ పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సూళ్లూరుపేటలో దొంగలు హల్‌చల్

షాపులే టార్గెట్టుగా చోరీ యత్నాలు

ఐదుగురు దొంగలు ఉన్నట్లు అనుమానం

ప్రజాశక్తి-సూళ్లూరుపేట

సూళ్లూరుపేట,తడ పట్టణాలలో మంగళవారం అర్ధరాత్రి దొంగలు హల్ చల్ చేశారు.సూళ్లూరుపేట పట్టణంలో మూడు చోట్ల చోరీకి విఫలయత్నం చేశారు. అలాగే తడలో కూడా మూడు చోట్ల చోరీకి ప్రయత్నించి ఉన్నారు. సూళ్లూరుపేటలోని మోర్ సూపర్ మార్కెట్ షెట్టర్ తాళాలు పగలగొట్టి అద్దాలను బండరాళ్లతో కొట్టి లోనికి ప్రవేశించి ఉన్నారు. లోపల కంప్యూటర్ల క్రింద ఉండే కాష్ డ్రాలను పగలకొట్టే ప్రయత్నం చేశారు. అలాగే వెంకటేశ్వర స్వామి ఆలయం ఎదురుగా ఉన్న కెకె పాన్ బ్రోకర్స్ షాపు తాళాలు పగలగొట్టారు కానీ లోనికి వెళ్లలేక పోయారు .దానికి ఎదురుగా ఉన్న పాత అష్టలక్ష్మి సూపర్ మార్కెట్ షెట్టర్ తాళాలు పగలగొట్టి చోరీకి ప్రయత్నించి ఉన్నారు. తమిళనాడుకు చెందిన ఐదుగురు దొంగలు ఇలా హల్ చల్ చేసినట్లు సీసీ కెమెరాలలో రికార్డు అయినట్లు తెలుస్తోంది. చెన్నయ్ నుండి ముందుగా తడలో చోరీలకు ప్రయత్నించి అనంతరం సూళ్లూరుపేట లోనూ చోరీలకు పాల్పడినట్లు తెలుస్తోంది.

తడలో రెండు చోట్ల చోరీకి విపయత్నం చేసిన దొంగలు ఓ సెల్ ఫోన్ షాపులో మాత్రం కొన్ని సెల్ ఫోన్స్ తో పాటు 20 వేలు నగదు చోరీ చేసినట్లు తెలిసింది. దొంగలు రెండు మోటర్ బైకుల్లో వచ్చారు. అందరు ముసుగులు ధరించి ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్సీ ఓట్లు ఎలా లెక్కిస్తారు?

- అన్ని బ్యాలెట్ బాక్సుల్లోని ఓట్లను ఒక డ్రమ్ములో కుమ్మరించి వాటిని కలిపేస్తారు. దీనివల్ల ఏ పోలింగ్ స్టేషన్లో ఎవరికి ఎన్ని ఓట్లు వచ్చాయో తెలిసే అవకాశం ఏమాత్రం లేదు.
- అభ్యర్థి గెలుపుకు చెల్లిన ఓట్లలో సగం 1 రావాలి. తొలుత (1) మొదటి ప్రాధాన్యత ఓట్లను ఎవరికి ఎన్ని వచ్చాయో లెక్కిస్తారు. వీటిలోనే చెల్లిన ఓట్లలో సగం o1 వస్తే ఆ అభ్యర్థిని గెలిచినట్లు ప్రకటిస్తారు. అప్పుడు 2, 3, 4 ఓట్లు లెక్కించాల్సిన అవసరం రాదు.
- మొదటి (1) ఓట్లు ఎవరికీ సగం o1 రాకపోతే అందరి కంటే తక్కువ మొదటి ఓట్లు వచ్చిన వారిని (ఎలిమినేట్) తొలగిస్తారు. అతని రెండవ (2) ఓట్లను మిగిలినవారికి ఎవరికెన్ని వచ్చాయో లెక్కించి కలుపుతారు. ఇప్పుడు ఏ అభ్యర్థికైనా సగం o1 వస్తే అతన్ని గెలిచినట్లు ప్రకటిస్తారు. దీంతో ఓట్ల లెక్కింపు ముగుస్తుంది.
- అప్పటికీ సగం o 1 రాకపోతే ఆ తర్వాత తక్కువ ఓట్లు వచ్చిన వారిని తప్పించి అతని రెండవ (2) ఓట్లను మిగిలినవారికి ఎవరికెన్ని వచ్చాయో లెక్కించి కలుపుతారు. అప్పటికీ ఎవరికీ సగం o 1 రాకపోతే ఇప్పటికే ఎలిమినేట్ అయిన ఇద్దరి మూడవ (3) ఓట్లు కూడా లెక్కించి పైవారికి కలుపుతారు.
- ఇలా సగం o1 వచ్చే వరకు క్రింది నుండి తక్కువ ఓట్లు వచ్చిన వారి 2, 3, 4. ఓట్లు ఇలా ఒక క్రమంలో కలుపుకుంటూ పోతారు.
- చివరిదాకా సగం o1 రాకపోతే ఎలిమినేట్ కాని చివరి అభ్యర్థిని గెలిచినట్లు ప్రకటిస్తారు.
- మనం మొదటి ఓటు వేసిన అభ్యర్థి పోటీ నుంచి ఎలిమినేట్ అయితే మాత్రమే అతని 2, 3, 4 ఓట్లు లెక్కిస్తారు. కాబట్టి అతనికి వచ్చే నష్టం ఏమీ వుండదు

జూనియర్, సీనియర్ల మధ్య ఘర్షణ

విద్యార్థి తలకు తీవ్రగాయాలు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

చంద్రగిరి బాయ్స్ కళాశాల బీసీ హాస్టల్లో జూనియర్, సీనియర్ విద్యార్థుల మధ్య ఘర్షణ తీవ్రస్థాయికి చోటు చేసుకుంది. ఈ గొడవల్లో సీనియర్ విద్యార్థి రాఘవేంద్ర తలను బయటి వ్యక్తులు వచ్చి కొట్టారని సీనియర్ విద్యార్థులు వాపోతున్నారు. హాకీ స్టిక్స్, ఇనుపరాడ్‌లతో దాడి చేశారని తెలుస్తోంది. ఈ గొడవను సెల్‌ఫోన్‌లో చిత్రీకరిస్తున్న వంట మాస్టర్ సెల్ తీసుకుని వీడియోలను డిలీట్ చేయడం గమనార్హం. అయితే ఇంత గొడవ జరుగుతుంటే నిత్యం హాస్టల్లో ఉండాల్సిన వార్డెన్ లేకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఇంటర్ పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ ఘటనతో హాస్టల్లో టెన్షన్ వాతావరణం చోటు చేసుకుంది. బయటి వ్యక్తులను హాస్టల్ లోనికి ఎలా అనుమతిస్తారని విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు. పరీక్షలకు వెళ్లే సందర్భంగా బయట ఎక్కడైనా గొడవ జరుగుతుందేమోననే భయాందోళనలో విద్యార్థులు ఉన్నారు. అయితే అసలు గొడవకు కారణం ఏంటన్నది విచారణలో తేలాల్సి ఉంది.

అన్నమయ్య పోస్టర్ ఆవిష్కరణ

తిరుపతి సిటి : తాళ్లపాక అన్నమయ్య 520వ వర్ధంతి కార్యక్రమాల పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. మార్చి 18 నుంచి 21 వరకు తిరుపతి, తిరుమల, తాళ్లపాకలో కార్యక్రమాలు జరగనున్నాయి. పోస్టర్‌ను టిటిడి ఈవో టిటిడి పరిపాలనా భవనంలో ఆవిష్కరించారు. జేఈవో సదా భార్గవి, ఎఫ్ఎసిఎఒ బాలాజీ, ధార్మిక ప్రాజెక్టుల ప్రోగ్రామ్ అధికారి రాజగోపాలరావు, అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకులు డాక్టర్ విభీషణశర్మ పాల్గొన్నారు. తిరుమలలో 18న సాయంత్రం ఆరు గంటలకు నారాయణగిరి ఉద్యానవనంలో ప్రముఖ కళాకారులతో సప్తగిరి సంకీర్తనా గోష్టిగానం నిర్వహిస్తారు. 17న అలిపిరిలో మెట్లోత్సవం జరగనుంది.

3-5 తేదీల్లో తిరుమల శ్రీవారి సాలకట్ల వసంతోత్సవాలు

ప్రజాశక్తి - తిరుమల

తిరుమల శ్రీవారి ఆలయంలో ఏప్రిల్ 3 నుండి 5వ తేదీ వరకు మూడు రోజులపాటు సాలకట్ల వసంతోత్సవాలు అత్యంత వైభవంగా జరగనున్నాయి. ప్రతి సంవత్సరం చైత్రశుద్ధ పౌర్ణమికి ముగిసేటట్లుగా ఈ ఉత్సవాలు మూడు రోజులపాటు నిర్వహించడం ఆనవాయితీ. ఏప్రిల్ 3వ తేదీన ఉదయం 7 గంటలకు శ్రీదేవి భూదేవి సమేతంగా శ్రీ మలయప్ప స్వామివారు నాలుగు మాడవీధులలో ఊరేగుతారు. అనంతరం వసంతోత్సవ మండపానికి వేంచేపు చేశారు. ఇక్కడ వసంతోత్సవ అభిషేక నివేదనలు పూర్తయిన అనంతరం తిరిగి ఆలయానికి చేరుకుంటారు. ప్రతి రోజు సాయంత్రం 6 నుండి 6.30 గంటల వరకు ఆస్థానం ఘనంగా నిర్వహిస్తారు. వసంత ఋతువులో శ్రీ మలయప్పస్వామివారికి జరిగే ఈ ఉత్సవానికి 'వసంతోత్సవ'మని పేరు ఏర్పడింది. ఈ క్రతువులో సుగంధ పుష్పాలను స్వామికి సమర్పించటమే కాక వివిధ ఫలాలను నివేదించడం ఈ వసంతోత్సవంలో ప్రధాన ప్రక్రియ. ఈ నేపథ్యంలో కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టిటిడి రద్దు చేసింది.

నష్టం జరిగితే వినియోగదారులు ప్రశ్నించాలి

క్యాంపస్ : ఏ వస్తువైనా కొన్నప్పుడు బిల్లు, గ్యారంటీ కార్డు లాంటివి తీసుకుని, నష్టం, అన్యాయం జరిగినపుడు ఖచ్చితంగా అప్పటికప్పుడే ప్రశ్నించాలని వినియోగదారుల సంఘం అధ్యక్షులు ఇ.రాజారెడ్డి అన్నారు. విశ్వం టాలెంట్ స్కూల్లో వినియోగదారుల క్లబ్, జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం ఆధ్వర్యంలో ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఇ.రాజారెడ్డి మాట్లాడుతూ విద్యార్థి స్థాయి నుంచి వినియోగదారులుగా మనకు ఉన్న హక్కులను బాధ్యతగా తెలుసుకుని విజ్ఞానవంతుడైన వినియోగదారులుగా భవిష్యత్‌లో సమాజాన్ని చైతన్యవంతులను చేయాలన్నారు. హక్కులను, చట్టాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. విశ్వం విద్యా సంస్థల అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఎక్కువగా నాణ్యతలేని జంక్ ఫుడ్స్ తినడం వల్ల చిన్నతనంలోనే కంటి చూపు, జ్ఞాపకశక్తి తగ్గడం లాంటి ప్రమాదకరమైన వ్యాధులకు బలవుతున్నారని, కల్తీల విషయంలో అప్రమత్తతగా ఉండాలన్నారు. పద్మావతి మహిళా కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ స్వరాజ్యలక్ష్మి, అప్పాస్మా తిరుపతి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బీ.రవీంద్ర రెడ్డి, ఓ.వెంకటరమణ రెడ్డి పాల్గొన్నారు.

దేశంలో ప్రతి ఒక్కరూ వినియోగదారులేనని జిల్లా వినియోగదారుల సంఘం అధ్యక్షులు, విశ్రాంత జిల్లా కోర్టు జడ్జి ఎ.పార్థసారథి అన్నారు. దేశ ప్రథమ పౌరుడైనా వినియోగదారుడేనని అన్నారు. ఎస్వీయూ ఆర్థిక శాస్త్ర విభాగం, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ తిరుపతి లోకల్ బ్రాంచి, జిల్లా వినియోగదారుల సంఘం, రాయలసీమ ఎకనామిక్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సెమినార్ హాలులో ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. విద్యార్థులు, పరిశోధకులు, అధ్యాపకులు ఎవరైనా వినియోగదారుని హక్కులపై కనీస పరిజ్ఞానం, అవగాహన ఎంతైనా అవసరమన్నారు. 1986లో భారతదేశంలో వినియోగదారుల చట్టం వచ్చిందన్నారు. సంఘం సభ్యులు టి.స్నేహలత, డి.క్రిష్ణమూర్తి, ఎం.దేవరాజులు పాల్గొన్నారు.



వైసీపీ నేతలు అబద్దాలు మానుకోవాలి



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: స్థానిక వైసీపీ నేతలు అబద్దాలు చెప్పడం మానుకుని, ఆత్మపరిశీలన చేసుకోవాలని, శాసనమండలి ఎన్నికల్లో వైసీపీ నాయకులు దొంగోట్లు వేయించినట్లు నిరూపించడానికి తాము సిద్ధమని టీడీపీ నేతలు సవాలు విసిరారు. స్థానిక ఎన్టీఆర్ భవన్‌లో బుధవారం టీడీపీ నేతలు కాసరం రమేష్, చిన్నారెడ్డి, మిన్నల రవితో పాటు మరికొందరు మీడియాతో మాట్లాడారు. ఈ నెల 13న జరిగిన శాసనమండలి ఎన్నికల్లో శ్రీకాళహస్తిలో వైసీపీ నేతలు విచ్చలవిడిగా దొంగోట్లు వేయించారన్నారు. అందుకు కొత్తపేట బాలికల ఉన్నత పాఠశాలలో తప్ప, మిగిలిన కేంద్రాల్లో సుమారు 90శాతం వరకు పోలింగ్ నమోదైందన్నారు. బాలికల ఉన్నత పాఠశాలలో దొంగోట్లు వేసే వారిని అడ్డుకోవడంతోనే అక్కడ పోలింగ్ శాతం తగ్గిందన్నారు. ఎంతో మందికి విద్యా బుద్ధులు నేర్పి ప్రస్తుతం ధర్మకర్తల మండలి అధ్యక్షులుగా ఉన్న అంజూరు తారక శ్రీనివాసులు, విద్యా సంస్థలు నడిపే మిద్దెల హరి లాంటి వ్యక్తులు కూడా దొంగోట్లపై అబద్దాలు చెప్పడం బాధ కలిగిస్తోందన్నారు. గౌరవ స్థానంలో ఉన్న వీరిద్దరూ అబద్దాలు చెబితే సమాజానికి ఏం సందేశం ఇస్తారని వారు ప్రశ్నించారు. దొంగోట్లు వేయడానికి ప్రోత్సహించిన వారిపై చర్యలు తీసుకోకుండా అడ్డుకోవడానికి యత్నించిన తెలుగుదేశం పార్టీ నేతలపై అక్రమ కేసులు బనాయించడం ఎంతవరకు న్యాయమని వారు ప్రశ్నించారు. అధికార పార్టీ వైసీపీ నేతల ప్రోద్బలంతోనే పోలీసులు ఇలా చేస్తున్నారని వారు ఆరోపించారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న వైసీపీ నేతలకు ప్రజలే తగిన గుణపాఠం చెప్పాలని వారు కోరారు. ఈ సమావేశంలో పలువురు టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భోజన ప్యాకెట్ల పంపిణీ



ప్రజాశక్తి-రేణిగుంట: యువనేస్తం అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం రేణిగుంటలోని అక్షయ క్షేత్రంలో సరస్వతి కండ్రిగ గ్రామానికి చెందిన బి.నాగేంద్ర బాబు, స్వప్నల కుమార్తె హిమంషి మొదటి పుట్టిన రోజు సందర్భంగా సుమారు 60 మంది అనాథలకు, వికలాంగులకు భోజన ప్యాకెట్లను పంపిణీ చేసినట్లు యువనేస్తం అసోసియేషన్ అధ్యక్షులు మునిశేఖర్, యువనేస్తం ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు వినోద్ తెలిపారు. ఈ సందర్భంగా మునిశేఖర్, వినోద్‌లు మాట్లాడుతూ రోజూ ఎంతో మంది అనాథలు, వికలాంగులు దాతల సహాయం కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. అనాథలకు, వికలాంగులకు అన్నదానం చేయడానికి దాతలు ముందుకు రావాలని కోరారు. సరస్వతి కండ్రిగ గ్రామానికి చెందిన బి.నాగేంద్ర బాబు, స్వప్న కుమార్తె హిమంషి కి యువనేస్తం అసోసియేషన్ తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కనకమ్మ, నగేష్, వెంకటేష్, సంజీవరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందనలు



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి రూరల్: రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ పోటీలకు మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఓబులాయపల్లిలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని విష్ణు ప్రసన్న ఎంపికైనట్లు జిల్లా కమిటీ ప్రకటించినట్లు ప్రధానోపాధ్యాయులు బాలయ్య బుధవారం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థిని తయారు చేసిన "ఎకో కూలర్" ప్రాజెక్ట్ రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం మాకు ఎంతో గర్వకారణం అన్నారు. అనంతరం విద్యార్థినిని, సైన్సు ఉపాధ్యాయుడు తిలక్ కుమార్ బాషాను ప్రధానోపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

మహిళా ఫుట్‌బాల్ టోర్నమెంట్ ప్రారంభం



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ తరపున క్రీడా శాఖ మంత్రి ఆర్కే రోజా సహకారంతో బుధవారం స్థానిక ప్రభుత్వ ఎస్ఆర్ఎస్ కళాశాల మైదానంలో ఏపీ స్టేట్ సెమినార్ మహిళ ఫుట్‌బాల్ పుత్తూరు మున్సిపల్ వైస్ ఛైర్మన్ డి జయప్రకాష్ చేతుల మీదుగా కేకును కట్ చేసి ఫుట్‌బాల్ క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా ఫుట్‌బాల్ టీం ఎంపిక చేసి, ఈనెల 22వ తేదీన గోవా రాష్ట్రంలో జరుగే అంతర్ రాష్ట్ర మహిళా ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో ఈ జట్టు పాల్గొనేలా చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు నవీన్ కుమార్, గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ పీడీ సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల తనిఖీ




ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ, బీసీ సంక్షేమ శాఖ వసతి గృహాలను స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయ్ కుమారి బుధవారం తనిఖీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసంత గృహంలో విద్యార్థులకు తగినంత భోజనం అందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 10వ తరగతి విద్యార్థులకు పరీక్షల సమయంలో ఎలా చదవాలో అవగాహన కల్పించారు. ఈ సంవత్సరం 10వ తరగతిలో 100% శాతం ఉత్తీర్ణులు అవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయు రాలు అరుణ విజయలక్ష్మి, వసతి గహం ట్యూటర్స్ లీలప్రసాద్, దయాకర్ పాల్గొన్నారు.

18న ప్రత్యేక లోక్‌అదాలత్



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పట్టణంలోని కోర్టు ఆవరణలో ఈ నెల 18వ తేదీ ప్రత్యేక లోక్‌అదాలత్ నిర్వహించనున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర బుధవారం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కుటుంబ కేసుల రాజీ నిమిత్తం రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ప్రత్యేక లోక్‌అదాలత్ నిర్వహించబడుతుందని అన్నారు. ఈ లోక్‌అదాలత్‌లో గహహింస, రాజకీయ లోబడిన, వివాహ సంబంధాలు తదితర కేసులను రాజీ చేస్తామన్నారు. ఈ లోక్‌అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

టీడీపీ నాయకులవన్నీ దొంగనాటకాలు



పజాశక్తి-శ్రీకాళహస్తి: టీడీపీ నాయకులవన్నీ దొంగనాటకాలనీ, 'ఆడ లేక మద్దెలపై పడ్డట్లు' అన్న చందాన ఎమ్మెల్యే బియ్యపు మాధుసూదన్ రెడ్డిపై పడి ఏడుస్తున్నారని వైసీపీ నాయకులు విమర్శించారు. బుధవారం స్థానిక వైసీపీ క్యాంపు కార్యాలయంలో ఆ పార్టీ సీనియర్ నేతలు మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులు మాట్లాడుతూ దొంగోట్లకు సంబంధించి టీడీపీ నాయకుడు బొజ్జల సుధీర్ రెడ్డి ఆరోపణలను ఖండిస్తున్నామన్నారు. దొంగోట్లు పోలయ్యాయంటే పోలింగ్ 95 శాతం జరగాలి. కానీ 70 శాతం మాత్రమే ఎందుకు పోలయ్యాయని ప్రశ్నించారు. పోలీసులు అన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే పోలింగ్ బూతుల్లోకి అనుమతించారని గుర్తు చేశారు. ఎమ్మెల్యే పర్యవేక్షణలో ఎంతో పారదర్శకతతో ఎన్నికలు జరిగాయన్నారు. బియ్యపు మధుసూదన్ ప్రజల్లో మనిషనీ, ఆయనపై బొజ్జల సుధీర్ విమర్శలు మానుకోవాలని హితవు పలికారు. ఈ సమావేశంలో వైసీపీ నాయకులు ఉన్నం వాసుదేవనాయుడు, మిద్దెల హరి, సుమతి, సిరాజ్ బాషా, వడ్లతాంగాళ్ బాలాజిప్రసాద్ రెడ్డి, యతిరాజులు, జివికె రెడ్డి, యుగంధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వినాయకసాగర్ పనులు వేగవంతం చేయాలి : కమిషనర్



ప్రజాశక్తి-తిరుపతి టౌన్: తిరుపతి నగరానికి వన్నె తెచ్చేలా ఏర్పాటు చేస్తున్న వినాయకసాగర్ పనులను వేగవంతం చేయాలని తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్, స్మార్ట్ సిటి ప్రాజెక్ట్ ఎండి అనుపమ అంజలి అధికారులకు సూచించారు. వినాయకసాగర్ వద్ద జరుగుతున్న అభివద్ధి పనులను కమిషనర్ అనుపమ బుధవారం ఇంజనిరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వినాయకసాగర్ చుట్టూ ప్రజలను ఆకట్టుకునేలా అందంగా తయారు చేయాలన్నారు. ఫేస్ వన్ స్థాయి పనులను వచ్చే నెలలోపు పూర్తి చేసేలా అధికారులు పనులను పర్యవేక్షించాలన్నారు. వినాయకసాగర్ మధ్యలో ఏర్పాటు అవుతున్న డివైడర్లలో అందమైన చెట్లు వుండాలని, చుట్టూ పచ్చని గడ్డి లాన్ ఏర్పాటు చేయాలని, వాకింగ్ ట్రాక్ సిద్దం చేయాలని, చిన్న పిల్లలకు పార్క్, స్విమ్మింగ్ పూల్ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని కమిషనర్ అనుపమ అంజలి సూచించారు. అనంతరం అక్కారంపల్లె మాస్టర్ ప్లాన్ రోడ్ నిర్మాణ పనులను పరిశీలించి పనులను వేగవంతం చేయాలని ఆదేశాలు జారీ చేసారు. ఈ కార్యక్రమాల్లో అదనపు కమిషనర్ సునిత, సూపరింటెండెంట్ ఇంజనీర్ తిరుమాలిక మోహన్, మునిసిపల్ ఇంజనీర్ చంద్రశేఖర్, డిఈలు విజయకుమార్ రెడ్డి, సంజీవ్ కుమార్, డిప్యూటీ సిటీ ప్లానర్ దేవికుమారి, ఏయికామ్ ప్రతినిధి భాలాజీ పాల్గొన్నారు.

ఎస్వీయూ వీసీని రీకాల్ చెయ్యాలి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: గడచిన ఆరు దశాబ్దాల కాలంలో ఎంతోమంది విద్యావేత్తల అద్వితీయమైన కృషి ఫలితంగా సాధించుకున్న కీర్తి ప్రతిష్ఠలను కాపాడటంలో విఫలమైన శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం ఉపకులపతి రాజా రెడ్డిని రీకాల్ చెయ్యాలని శ్రీకాళహస్తి పురపాలక సంఘం 18 వ వార్డు మాజీ కౌన్సిలర్ డా.నివేదిత మోరె ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ ను బుధవారం ఒక ప్రకటనలో కోరారు. యుజిసి నిబంధనల ప్రకారం సుమారు 600 మంది రెగ్యులర్ అధ్యాపకులు ఉండవలసి ఉండగా, కేవలం 160 మంది ఉండటాన్ని గుర్తించిన న్యాక్ బందం యూనివర్సిటీ తీరును ఎండగడుతూ గతంలో ఉన్న గ్రేడ్ ను తగ్గిస్తూ నివేదిక పంపడం చాలా బాధాకరమైన విషయమని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అధ్యాపక నియామకాలు చేపట్టకుండా బోధనా ప్రమాణాలను దిగజార్చి, రాజకీయ నాయకుల భజనతో తమ పబ్బం గడుపుకునే అసమర్థ పాలకుల కారణంగానే యూనివర్సిటీ కీర్తి జాతీయ స్థాయిలో మసకబారిందని నివేదిత ఆవేదన వ్యక్తం చేశారు. శాశ్వత బోధకుల నియామకాలు చేపట్టి, పరిశోధనా రంగాన్ని అభివద్ధి చేయాల్సిన విశ్వవిద్యాలయ అధికారులు యూనివర్సిటీ ప్రాంగణంలో కులాల కుంపటి రాజేసి తమ పెత్తందారికి అడ్డులేకుండా చూసుకుంటూ, విశ్వవిద్యాలయ ప్రగతిని పక్కన పెట్టేశారని నివేదిత ఆరోపించారు. ఎస్వీయూకు అత్యున్నత గుర్తింపును తీసుకురావడంలో విఫలమైన ఉపకులపతి, ఇతర అధికారులను తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు.

గ్రామీణ ఉపాధి హామీ పనుల తనిఖీ



ప్రజాశక్తి-ఓజిలి: మండల పరిధిలోని మానవాలి గ్రామ పంచాయతీలో జరుగుతున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను డ్వామా పీడీ సివి. శ్రీనివాస్ ప్రసాద్ బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో జరుగుతున్న పనులు, కూలీలకు అందుతున్న వేతనాలపై కూలీలను అడిగి తెలుసుకున్నారు. పని ప్రదేశంలో అధికారులు కల్పిస్తున్న సౌకర్యాలను, రోజూ ఎంత మంది కూలీలకు పని కల్పిస్తున్నారు, ఇప్పటి వరకు ఎన్ని రోజులు పని పూర్తి అయ్యాయి, కూలీలకు ఎంత డబ్బులు వచ్చాయి తదితర విషయాలపై సిబ్బందిని ఆరా తీశారు. కూలీల హాజరు పట్టికను పరిశీలించి, ఉపాధి కూలీలు వేసవిని దృష్టిలో ఉంచుకొని తగు జాగ్రత్తలు పాటించే విధంగా ముందస్తు చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఎపిఒ టి.ఉషారాణి, మల్లికార్జున్, మహేష్, భార్గవి ఉన్నారు.

బాలాయపల్లి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులలో కూలీలకు గిట్టుబాటు కూలి కల్పించాలని డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ అన్నారు. బుధవారం మండలంలోని పెరిమిడి గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి పనులు విస్తృతంగా ఉన్నందున కూలీలు ఉపయోగించుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు కూలి డబ్బులు కూలీల ఖాతాలో జమ అవుతున్నాయని చెప్పారు. కూలీలు ఫీల్డ్ అసిస్టెంట్ ఇచ్చిన కొలతల ప్రకారం పనులు చేపడితే కూలి గిట్టుతుందన్నారు. ఏపీ హరినాథ్, ఈసీ సుబ్రమణ్యం, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా క్షీరాధివాసం

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: చెన్నై నగరంలోని జిఎన్ చెట్టి వీధిలో టిటిడి నూతనంగా నిర్మించిన శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయ విగ్రహప్రతిష్ట, మహాకుంభాభిషేకం కార్యక్రమాల్లో భాగంగా బుధవారం సాయంత్రం శాస్త్రోక్తంగా క్షీరాధివాసం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి విగ్రహానికి అభిషేకం చేశారు. టిటిడి పాంచరాత్ర ఆగమ సలహాదారులు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఉదయం చతుష్టానార్చన, మూర్తిహోమం, ప్రాయశ్చిత్తం, పూర్ణాహుతి, కర్మాంగస్నపనం, విమాన నయనోన్మీలనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చెన్నై స్థానిక సలహా మండలి అధ్యక్షులు శేఖర్ రెడ్డి, డెప్యూటీ ఈవో విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇండస్ట్రీ ఫస్ట్ కో-బ్రాండెడ్ క్రెడిట్ కార్డ్ ప్రారంభం

ప్రజాశక్తి-తిరుపతిటౌన్: దేశంలోని అతిపెద్ద ప్రైవేట్ బ్యాంక్ హెచ్‌డీఎఫ్‌సీ, భారతదేశంలోని స్వదేశీ ఫ్లిప్‌కార్ట్ గ్రూప్ విస్తృతమైన ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ఉనికిని కలిగిన ఓమ్నిఛానెల్ బి2బి ప్లాట్‌ఫారమ్ బుధవారం ఇండస్ట్రీ-ఫస్ట్ కో-బ్రాండెడ్ క్రెడిట్ కార్డ్ ను ప్రారంభించింది. ఫ్లిప్‌కార్ట్ హోల్‌సేల్ సభ్యుల కోసం క్రెడిట్ కార్డ్ డిస్కవర్ గ్లోబల్ నెట్వర్క్‌లో భాగమైన డైనర్స్ క్లబ్ ఇంటర్నేషనల్ నెట్వర్క్‌లో ఇది రన్ అవుతుంది. డైనర్స్ క్లబ్ కార్డ్‌లు ప్రపంచవ్యాప్తంగా 200 కంటే ఎక్కువ దేశాలలో ఉపయోగించవచ్చు. ఈ సందర్భంగా ఫ్లిప్‌కార్ట్ హోల్‌సేల్ బిజినెస్ హెడ్ కోటేశ్వర్ ఎల్ఎన్ మాట్లాడుతూ ఫ్లిప్‌కార్ట్ హెూల్‌సేల్‌లోని సభ్యులు ఫ్లిప్‌కార్ట్ హెూల్‌సేల్ ఆన్‌లైన్ ఖర్చులపై ఐదు శాతం క్యాష్‌బ్యాక్ ఇండస్ట్రీ ఫస్ట్ ఆఫర్‌ను పొందవచ్చన్నారు. ఇంకా రూ.1,500 విలువైన యాక్టివేషన్ క్యాష్‌బ్యాక్, జీరో జాయినింగ్ ఫీజుతో పాటు యుటిలిటీ బిల్లులు, ఇతర ఖర్చులపై అదనపు క్యాష్ బ్యాక్ కూడా ఉన్నాయన్నారు. కో-బ్రాండెడ్ క్రెడిట్ కార్డ్‌ల ప్రారంభం క్రెడిట్ యాక్సెస్‌ను మెరుగుపరుస్తుందన్నారు. భారతదేశంలోని చిన్న వ్యాపారులకు బహుళ ప్రయోజనాలను అందిస్తూ డిజిటల్ చెల్లింపుల స్వీకరణను వేగవంతం చేస్తోందని తెలిపారు. ఫ్లిప్‌కార్ట్ హోల్‌సేల్‌లో సాంకేతికత, ఆవిష్కరణల శక్తిని ఉపయోగించడం ద్వారా కిరాణా రిటైల్ పర్యావరణ వ్యవస్థను మార్చడానికి కట్టుబడి ఉన్నామన్నారు. ఈ విజన్‌లో భాగంగా చిన్న రిటైలర్‌ల ఆర్థిక సవాళ్లను పరిష్కరించే లక్ష్యంతో సులభమైన, సరైన క్రెడిట్ ప్రారంభించడంపై దష్టి పెడుతున్నామని పేర్కొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు ఉచిత వైద్యపరీక్షలు



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: నగరపాలక సంస్థలో విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని నగర మేయర్ ఎస్. అముద, కమిషనర్ డాక్టర్ జె.అరుణ చెప్పారు. నగరపాలక సంస్థ పరిధిలో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులకు బుధవారం ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. వైద్యశిబిరంలో సీఎంసీ ఆసుపత్రి వైద్యులు కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా మేయర్, కమిషనర్, డిప్యూటీ మేయర్లు చంద్రశేఖర్, రాజేష్ కుమార్‌రెడ్డి సందర్శించారు. కార్మికులకు అవసరమైన అన్ని వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేయాలని సూచించారు. ఈ సందర్భంగా కమిషనర్ అరుణ మాట్లాడుతూ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో నగరపాలక పారిశుద్ధ్య కార్మికులు పాత్ర ఎనలేనిదని అన్నారు. క్లిష్టపరిస్థితుల్లో విధులు నిర్వహిస్తున్న కార్మికుల సంక్షేమం, ఆరోగ్య పరిరక్షణకు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో అన్నిచర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. క్రమం తప్పకుండా వైద్యశిబిరాలు నిర్వహిస్తామన్నారు. సీఎంసీ వైద్యుల ఆధ్వర్యంలో జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్, గైనిక్, డెంటల్, ఈఎన్టీ, ఆప్తమాలజీ విభాగాల్లో వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసినట్లు చెప్పారు. వైద్యశిబిరంలో 320 మంది వైద్యపరీక్షలు చేయించుకున్నారు. వైద్యపరీక్షలు అనంతరం మాత్రలు, టానిక్‌లు అందించారు. ఎం హెచ్వో డాక్టర్ లోకేష్, శానిటరీ ఇన్స్పెక్టర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

'మా బిడ్డను కాపాడండి'



ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: మూర్ఛ, శ్వాసకోస వ్యాధితో బాధపడుతున్న రెండు సంవత్సరాల తమ బిడ్డకు ఆసుపత్రులో మెరుగైన వైద్యం అందించేందుకు దాతలు ముందుకొచ్చి ఆదుకోవాలని యాదమరి మండలం కీనాటంపల్లి దళితవాడకు చెందిన శివ కుమార్, ఝాన్సీలు వేడుకున్నారు. బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మీడియాను ఆశ్రయించి తమ ఆవేదనను వ్యక్తం చేశారు. యాదమరి మండలం కీనాటంపల్లి దళిత వాడకు చెందిన శివకుమార్, ఝాన్సీలు బెంగళూరులో కూలిపను లు చేసుకుంటూ జీవించేవారు. వీరికి మొదటికాన్పులో ఆడబిడ్డ పుట్టడంతో సంతోషపడ్డారు. బిడ్డ పుట్టిన ఆరునెలలకు రెండవ టీకాను బెంగుళూరులో వేయించారు. టీకా వికటించడంతో విపరీత మైన జ్వరంతో పాటు మూర్ఛ వచ్చింది. బెంగుళూరు రైబో చిన్న పిల్లల ఆసుపత్రిలో చికిత్స చేయిస్తోండగా శ్వాసపీల్చడం ఇబ్బంది కరంగా మారింది. దీంతో వైద్యులు వెంటిలేటర్ సహాయంతో చిన్నారి ప్రాణాలను కాపాడగలిగారు. అయితే చిన్నారి తరచూ ఇలాగే ఇబ్బంది పడుతుండడంతో కూలినాలీ చేసి సంపాదించిన డబ్బుతో చిన్నారికి చికిత్స చేయించారు. ఇప్పటివరకు ఆసుపత్రిలో రూ.11 లక్షలు ఖర్చు చేశారు. మెరుగైన వైద్యం చేయించడానికి ఆర్థికస్థోమత లేకపోవడంతో దాతలు ముందుకు వచ్చి తన బిడ్డ ప్రాణాలను కాపాడాలని వారు వేడుకున్నారు. దాతలు సహాయం చేయాలనుకున్న వారు వి.శివకుమార్ యూనియన్ బ్యాంక్ యాదమరి అకౌంట్ నెంబర్ 423302010078896, ఫోన్ పే, గూగుల్ పే 8197753717కు ఆర్థికసాయం చేయాల్సిందిగా వేడుకున్నారు.

ఏసీబీ వలలో పంచాయతీ సెక్రటరీ

ప్రజాశక్తి-తడ: మండలంలోని తడ కండ్రిగ గ్రామ పంచాయతీలో అడిషనల్ ఎస్పీ దేవప్రసాద్, డీఎస్పీ జనార్ధన్ నాయుడు, సీఐలు ఈశ్వర్, ప్రతాప్‌రెడ్డి, వెంకటనాయుడు లతో ఏర్పడిన బృందం బుధవారం సోదాలు నిర్వహించారు. సోదాల్లో తడ కండ్రిగ గ్రామ పంచాయతీ సెక్రెటరీ రమణయ్య ఇంటి ప్లాన్ అప్రూవల్‌కు ఓ వ్యక్తి దగ్గర రూ.40 వేలు లంచం తీసుకుంటూ దొరికినట్లు వారు తెలిపారు. దీంతో మండలంలోని అధికారులు అప్రమత్తమయ్యారు.

పౌష్టికాహారం పంపిణీ



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: నగిరి నియోజకవర్గంలోని ప్రభుత్వ హాస్పిటల్లో వైద్యానికి వచ్చే గర్భిణులకు, బాలింతలకు, చిన్నపిల్లలకు, రోజా ఛారిటబుల్ ట్రస్ట్‌లో బుధవారం ఉచితంగా పౌష్టికాహారం అందించారు. పౌష్టికాహారంలో అన్నం, కూర, స్వీట్లు, అరటిపండు, కోడిగుడ్డు, ఒడియాలు, అప్పలాలు అందించారు. మహిళలతోపాటు పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉండాలనే ఆలోచనతో 5 సంవత్సరాలుగా మంత్రి చేపడుతున్న కార్యక్రమం చాలా ఉపయోగంగా ఉంటుందని మహిళలు ఆమెను అభినందించారు. సొంత డబ్బుతో నిరంతరం అన్నదాన కార్యక్రమాన్ని కొనసాగిస్తున్న మంత్రి రోజా దాతత్వంపై పలువురు గర్భిణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా నో బ్యాగ్ డే



ప్రజాశక్తి-గూడూరు: స్థానిక రెండో పట్టణ పరిధిలోని శ్రీ స్వర్ణాంధ్ర భారతి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో "నో బ్యాగ్ డే" సందర్భంగా బుధవారం వివిధ రకాల యాక్టివిటీస్ నిర్వహించినట్లు స్కూల్ కరస్పాండెంట్ పి.నవకోటి నాయుడు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నో బ్యాగ్ డే సందర్భంగా పిల్లల్లో ఐక్యతను పెంచడానికి, వంటల తయారీపై అవగాహన కల్పించడానికి వివిధ రకాల పచ్చళ్లను పిల్లల దగ్గర తయారు చేయించినట్లు తెలిపారు. పచ్చళ్ల తయారీ, వాటి నిల్వలపై పిల్లలకు ఉపాధ్యాయులు తెలియజేసినట్లు తెలిపారు. అకాడమిక్ డీన్ సునీల్, అకాడమిక్ కోఆర్డినేటర్ హరికష్ణ, మరియు ప్రైమరీ ఇన్‌ఛార్జ్ ఎన్.సాయి సింధు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

11 ఎర్రచందనం దుంగలు స్వాధీనం



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): అన్నమయ్య జిల్లా రాజంపేట వద్ద 11 ఎర్రచందనం దుంగలను టాస్క్‌ఫోర్స్ అధికారులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఎస్పీ కె.చక్రవర్తి ఆదేశాల మేరకు డీఎస్పీ మురళీధర్ ఆధ్వర్యంలోని ఆర్ఐ కపానంద బందం రాజంపేట రేంజ్ ఎస్ఆర్ పాలెం సెక్షన్ రోళ్లమడుగు అటవీ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహిస్తుండగా పెద్దకోన తలగడలో కొంత మంది దుంగలను మోసుకుని వెళుతూ కనిపించారన్నారు. వారిని హెచ్చరిస్తూ సమీపించే సరికి, వాళ్లు దుంగలను పడేసి పారిపోయారన్నారు. ఆ ప్రాంతంలో 11 ఎర్రచందనం దుంగలు లభించాయన్నారు. దుంగలు స్వాధీనం చేసుకుని, పారిపోయిన వారి కోసం గాలింపు చర్యలు చేపట్టామన్నారు. దుంగలను తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీసు స్టేషన్‌కు తరలించామన్నారు. సీఐ బాలకష్ణ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారన్నారు.

20 లీటర్ల నాటు సారా పట్టివేత



ప్రజాశక్తి-యర్రావారిపాలెం: ఎస్ఇబి, చంద్రగిరి డివిజన్ సిఐ లీలారాణికి అందిన రహస్య సమాచారం మేరకు మండలంలోని ఎల్లమంద గ్రామ పంచాయతీకి చెందిన గొల్లపల్లి గ్రామంలో బుధవారం తన సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈ దాడిలో గొల్లపల్లి గ్రామానికి చెందిన బాల అనంతు(56), బండకాడపల్లికి చెందిన బండి జయన్న(58)లు 20 లీటర్ల నాటు సారా కలిగి ఉండగా ప్రసాద్ నగర్ చెక్‌పోస్ట్ వద్ద దాడి చేసి పట్టుకున్నట్లు ఎస్ఇబి, సిఐ లీలారాణి తెలిపారు. పట్టుబడ్డ వారిని అరెస్టు చేసి వారిపై కేసు నమోదు చేసి రిమాండుకు పంపినట్టు వారు తెలిపారు.

నులిపురుగులపై అవగాహన

ప్రజాశక్తి-కెవిబి పురం: జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా కెవిబి పురం మండలంలోని ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు నులిపురుగులపై డాక్టర్ సురేష్ బాబు ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు రోజూ ఆహారం తీసుకునే ముందు చేతులను సబ్బుతో కడుక్కోవాలన్నారు. నులిపురుగు సంక్రమించిన పిల్లల్లో గుడ్లుగా ఉత్పత్తి చెంది పిల్లలను అనారోగ్య బారిన పడేస్తాయని తెలిపారు. దీన్ని నివారించడానికి విద్యార్థులందరూ ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ జాతర ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి-చిల్లకూరు: మండల పరిధిలోని తూర్పు కనుమరు గ్రామంలో వెలిసిన శ్రీశ్రీశ్రీ ముత్యాలమ్మ అమ్మవారి జాతరకు ఏర్పాట్లు పూర్తి అయినట్లు గర్భగుడి దాత, అన్నదాతలుగా వ్యవహరిస్తున్న పూలాని తిలక్ కుమార్ శెట్టి, లక్ష్మీనారాయణ శెట్టి, రామచంద్రన్ శెట్టి, చంద్రశేఖర్ శెట్టి బ్రదర్స్ బుధవారం తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ జాతరకు ఎల్లవేళలా అన్నదానం ఉంటుందని తెలిపారు. కావున భక్తాదులు విచ్చేసి జాతరలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు. వీరి కుటుంబాలు అనాది కాలం నుండి ఈ జాతరకు ప్రముఖ పాత్ర వహిస్తున్నారన్నారు.

ముత్యాలమ్మ జాతరలో గణాచారి: శ్రీశ్రీశ్రీ ముత్యాలమ్మ అమ్మవారి జాతరలో గణాచారి అలియాస్ పోలిశెట్టి ప్రధాన పాత్రగా వ్యవహరిస్తారు. ఈ గణాచారి ఎదుటివారికి సూత్రం కడితే వివాహం కాని వారికి వివాహం, సంతానం లేని వారికి సంతానం కలుగును. భక్తులు కోరిన కోరికలు తీర్చుట వీరి విశేషం.

మహారాజ రాజశ్రీ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు : కోట
O.S.NO. 55 / 2022

1.దానా రామసుబ్బయ్య ....వాది
Vs
2.వేణుంబాక సాయిరెడ్డి ...ప్రతివాది

To
వేణుంబాక సాయిరెడ్డి.
తండ్రి శ్రీనివాసులు రెడ్డి, రవినగర్, కోట,
కోట మండలం, తిరుపతి జిల్లా.

పై తెలిపిన O.S.NO.55 / 2022 లో రెస్పాండెంట్ అయిన వేణుంబాక సాయిరెడ్డి నుండి బాకీ వసూలు కోరుచూ పై తెలిపిన కోర్టులో O.S.NO. 55 / 2022 దాఖలు చేసియున్నారు. సదరు O.S.NO. 55 / 2022 ని నీకు నోటీసు నిమిత్తం తే.20-03-2023దిన వాయిదా ఉన్నది. కావున మీరు ఆదినం స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ ఉదయం 10.30 గంటలకు పై కోర్టులో హాజరై కోర్టు వారితో మనవి చేసుకోవలసినది. లేనియెడల సదరు విషయమై నీ పరోక్షమున విచారించి తీర్మానం చేయదురని తెలియ జేయడమైనది.

ఇట్లు
ఎన్.మధుసూధన్ రావు, బి.ఎ., బి.ఎల్.,
అడ్వకేట్, కోట, తిరుపతి జిల్లా.

In The Court of X Additional District Judge: Tirupati
O.S.No. 149/2010

M.Reddy Rani ...Plaintiff
V/s
P.Prakash Reddy and other ...Defendants

SUMMONS TO THE DEFENDANT NO.3 & 6

D3) Mohammed Liyat Alikhan S/o Late Mohammad Ismail Kahan,
D6) S.Haseena D/o Late Mohammad Ismail Khan
Both are residing at Mallamgunta Village, Tirupati Rural Mandal, Tirupati District.

You both are the defendant No.3 and 6 in the above suit. The above suit is posted for your appearance on 24.03.2023. You both have to appear before the above court on theat day by 10.30 a.m., either in person or through advocate. If you fail to appear the matter will be preceded in your absence.

Hearing Date: 24.03.2023
K.KRANTHI CHAITANAYA
Advocate, Tirupati.

In The Court of IV Additional District Judge: Tirupati
O.S.No. 65/2018

Gundluru Indravathi and another ...Plaintiff
V/s
Noothalapati Suneetha And others ...Defendants

SUMMONS TO THE DEFENDANT NO.7 & 8

D7) M.Sujatha w/o T.Murali, Hindu, aged about 37 years, residing at D.No.19-9-28/C6, Lakshmipurum, Tirupati.
D8) K.Ramadevi w/o J.Srinivasulu, Hindu aged about 52 years Hindu, Residing at D.No.13-7-940A, Vivekanadha Street, Korlagunta, Tirupati.

You both are added as defendant No.7 and 8 in the above suit. The above suit is posted for your appearance on 02.05.2023. You have to appear before the above court on theat day by 10.30 a.m., either in person or through advocate. If you fail to appear the matter will be preceded in your absence.

Hearing Date: 02.05.2023
K.KRANTHI CHAITANAYA
PANGA RAVINDER
Advocates, Tirupati.

In the court of the Hon'ble Senior Civil Judge, Gudur
E.P.No. 79 /2018
O.S.No. 230/2014

Bayya Ramesh ... DHR/Plaintiff
Vs
Boddu Sudhakar ... JDR/Defendant

Notice to JDR

Boddu Sudhakar,
S/o **Ramanjaneyulu,**
Door No.3-4-19, Chinna Darga Street,
Naidupet Town & Mandal,
Tirupati Dt., A.P.

పై నెంబరు కేసులో డిక్రీ హోల్డరు మీమీద పై వారి కోర్టులో ఇ.పి. దాఖలు చేసియున్నారు. సదరు ఇ.పి.లో మీకు రూలు 66 నోటీసు నిమిత్తం **తేది: 12-04-2023** న వాయిదా ఉన్నది. ఆరోజు **ఉదయం 10.30 గంటలకు** మీరు స్వయంగా గానీ, వకీలు ద్వారా గానీ హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేనియెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

వి. శ్రీనివాసులు నాయుడు, బి.ఎ., బి.ఎల్.,
డిక్రీహోల్డరు తరపు న్యాయవాది,
నాయుడుపేట.